
## చిన్న చిత్రకారుడు

ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుడైన పురుష చిత్రకారుడిగా ఏస్ లియామ్ ననా స్యామ్ అంక్రా గిన్నిస్ రికార్డులోకి ఎక్కినట్టు చిత్రకారిణి అయిన అతడి తల్లి చాంటెల్లె కుకువా ఎఘున్ మే 25న వెల్లడించారు. ఘనాకు చెందిన ఈ చిన్నోడి వయస్సు ఒక సంవత్సరం 152 రోజులు. ఘనా రాజధాని అక్రాలోని మ్యూజియం ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నిర్వహించే ప్రాఫెషన్ ఎగ్జిబిషన్‌లో స్యామ్ గీసిన 10 పెయింటింగ్‌లను ప్రదర్శించాడు. దీనిలో 9 అమ్ముడుపోయాయి. చిన్నారి ‘ది క్రాల్’ పేరుతో తొలి మాస్టర్ పీస్‌ను సృష్టించినట్టు ఆమె వెల్లడించింది.

# వ్యాసం.. రాద్దాం ఇలా

## వ్యాస రచన మెళకువలు (Essay Writing Techniques) మొత్తం విషయం.. సంక్షిప్తంగా నిక్షిప్తం

**సివిల్స్, గ్రూప్-1 ప్రత్యేకం**




**అభ్యర్థి నుంచి ఏమి ఆశిస్తారు?**

- విషయాన్ని (టాపిక్) నిశితంగా పరిశీలించాలని, క్రమపద్ధతిలో ఆలోచనల అమరిక ఉండాలని (వ్యాస నిర్మాణం), సంక్షిప్తంగా రాయాలని ఆశిస్తారు. సమర్థవంతమైన, కచ్చితమైన వ్యక్తీకరణకు ప్రాధాన్యం ఇస్తారు.
- వ్యాసాల మూల్యాంకనంలో విషయం పట్ల గల అవగాహన, ఆలోచనల ఒరిజినాలిటీ, భావ వ్యక్తీకరణలో స్పష్టత, సమతుల్యమైన పరిష్కారం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.

**ఎలా ప్రారంభించాలి?**

- వ్యాసానికి పరిచయం అనేది సినిమాకు ట్రైలర్ లాంటిది. చాలా ఆసక్తికరంగా ప్రారంభించాలి, ఎంతో కుతూహలాన్ని సృష్టించాలి, నూతనత్వాన్ని ప్రదర్శించాలి, హృదయాన్ని స్పృశించాలి. అలాగే వ్యాసంలో లీనం కావాలంటే అద్భుతమైన పరిచయం అవసరం. ఉపోద్ఘాతం ఉపన్యాసంలా కాకుండా.. సంక్షిప్తంగా, సమయోచితంగా, అల్ప పదాల్లో అనల్ప భావాన్ని వివరించాలి.
- వాస్తవిక సంఘటన, చక్కటి కొటేషన్, చారిత్రక నేపథ్యం, సంక్షిప్తమైన కథ, ప్రామాణికమైన గణాంకాలు, శాస్త్రీయమైన ఆధారాలు, నిజ జీవిత ఉదాహరణ, సంస్థాగత నివేదికలో పేర్కొన్న కీలకాంశం/ అంశాలు, నిపుణుల అభిప్రాయాలు, రాజ్యాంగ నిబంధనలు.. ఇలాంటి వాటిలోని ఏదైనా ఒకటి లేదా రెండు అంశాలు ఉపయోగించి వ్యాసాన్ని ప్రారంభించాలి.

**ఎలా కొనసాగించాలి?**

- వ్యాసం ప్రధాన భాగంలో ప్రతి పేరా దేనికదే ప్రత్యేకంగా ఉండాలి. అలా అని పేరాల మధ్య తార్కికమైన సంబంధాన్ని విస్మరించకూడదు. ఒక ఆలోచన నుంచి మరో ఆలోచనకు, ఒక కోణం నుంచి మరో కోణానికి, ఒక పేరా నుంచి మరో పేరాకు కొనసాగే వ్యాసం ఒక ప్రవాహంలా ఉండాలి.
- వ్యాసాన్ని విస్తరించడానికి ఏ విధమైన కోణాల్లో ఆలోచించాలి? అనే స్పష్టత లేకపోతే సమగ్రమైన వ్యాసాన్ని రాయలేం. కింద పేర్కొన్న విభిన్నమైన కోణాలు వ్యాసాన్ని విస్తరించడానికి మాత్రమే కాకుండా ఏం రాయాలని ఆలోచిస్తూ.. ఏం తోచకుండా ఉండే సందిగ్ధం నుంచి వ్యాసాన్ని విస్తరించడానికి మహత్తరమైన మార్గాన్ని చూపిస్తాయి. దాంతో వ్యాసం చక్కగా రాయడానికి మార్గం సుగమం అవుతుంది.

**వ్యాసాన్ని విస్తరించడానికి 6 కోణాలు**

1) విభిన్న కోణాల్లో వ్యాసాన్ని విస్తరించాలి (Expanding Dimensions)- PESTLE- EC
2) వివిధ వర్గాల నుంచి వాదనలు ఇవ్వాలి (Give Arguments from the Perspective Of).
3) స్థూల కోణం నుంచి సూక్ష్మ కోణం వరకు పరిశీలించాలి (Macro to Micro).
4) కాలచక్రాన్ని అనుసరించాలి: నాడు-నేడు-రేపు (Follow the Time Frame: Yesterday-Today-Tomorrow).
5) విభిన్న ప్రదేశాల వద్ద గల సమస్యలను తెలియజేయాలి (Give Issues At).
6) తల్లి గర్భం నుంచి భూగర్భం వరకు సాగే ప్రయాణాన్ని వివరించాలి (Womb to Tomb Approach - Cradle To Grave).

**విభిన్న కోణాల్లో వ్యాసాన్ని విస్తరించాలి**

PESTLE- EC

- విభిన్న కోణాల్లో అంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంకేతిక, చట్టపరమైన, పర్యావరణ, నైతిక, సాంస్కృతిక కోణాల్లో విస్తరించాలి.

**రాజకీయ కారకాలు** (Political Factors): ప్రజాస్వామ్యం, ప్రభుత్వం, విధానాలు, పరిపాలన, రాజకీయ ఉద్యమాలు, రాజకీయ సుస్థిరత, అవినీతి.. మొదలైనవి.

**ఆర్థిక కారకాలు** (Economic Factors): ఆదాయ పంపిణీ, పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పన్నులు, కరెన్సీ, విదేశీ మారకం, ఆర్థిక వృద్ధి, వినియోగదారులు-వ్యాపారులు, డిమాండ్-సప్లయ్, వేతన రేట్లు, కనీస వేతనం, ప్రపంచీకరణ, జీవన వ్యయం మొదలైనవి.

**సామాజిక కారకాలు** (Social Factors): సామాజిక-సాంస్కృతిక కారకాలు, సామాజిక స్థితిగతులు, సామాజిక నేపథ్యాలు, జీవన శైలి జనాభా పెరుగుదల, వయస్సు పంపిణీ, ఆరోగ్య స్పృహ, వృత్తి వైఖరులు, భద్రత మొదలైనవి.

**సాంకేతిక కారకాలు** (Technological Factors): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, పరిశోధన, సాంకేతిక మార్పులు, నూతన ఆవిష్కరణలు మొదలైనవి.

**చట్టపరమైన కారకాలు** (Legal Factors): రాజ్యాంగ నిబంధనలు, ఉపాధి చట్టాలు, వినియోగదారుల రక్షణ చట్టాలు, కాపీరైట్, పేటెంట్ చట్టాలు, వివక్ష చట్టాలు, ఆరోగ్య, భద్రతా చట్టాలు, న్యాయ సంబంధిత అంశాలు మొదలైనవి.

**పర్యావరణ కారకాలు** (Environmental Factors): దేశ భౌగోళిక పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, వనరుల లభ్యత, జాతీయ పర్యావరణ చట్టాలు/ విధానాలు, అంతర్జాతీయ ఒప్పందాలు, కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, శక్తి వనరుల వినియోగం, గ్లోబల్ వార్మింగ్ మొదలైనవి.

**నైతిక కారకాలు** (Ethical Factors): నైతిక విలువలు, ఉన్నత ప్రమాణాలతో కూడిన ప్రవర్తన, సమగ్రత, కరుణ, సహానుభూతి, బాధ్యత మొదలైనవి. సహజంగా నాలుగు రకాలైన నైతిక సందిగ్ధతలు ఉంటాయి.

- వ్యక్తికి, సమాజానికి మధ్య సంఘర్షణ
- సత్యానికి, విశ్వాసానికి మధ్య సంఘర్షణ
- స్వల్పకాలిక ఫలితాలు, దీర్ఘకాలిక ఫలితాల మధ్య సంఘర్షణ
- న్యాయం, జాలి/ కరుణ మధ్య సంఘర్షణ
- వీటి మధ్య ‘మేధో మధనం’ జరిపి నైతిక ఎంపికలు/ నిర్ణయాలను తీసుకుంటారు. వ్యక్తి కంటే సమాజానికి, విశ్వాసం కంటే సత్యానికి, స్వల్పకాలిక ఫలితాల కంటే దీర్ఘకాలిక ఫలితాలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా పరిష్కారాలు సూచించాలి.

**సాంస్కృతిక కారకాలు** (Cultural Factors): సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాలు, జీవన విధానాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి మొదలైనవి.

**ఉదాహరణ:** పేదరికానికి గల కారణాలను పై కోణాల్లో ఆలోచించి వ్యాసాన్ని విస్తరించాలి.

**వివిధ వర్గాల నుంచి వాదనలు ఇవ్వాలి**

- ACDWW- వయోధికులు (వృద్ధులు), పిల్లలు, వికలాంగులు, స్త్రీలు, బలహీన వర్గాలు మొదలైనవి.
- ఈ విధానం ప్రత్యేకమైన పాయింట్లను రూపొందించడంలో సహాయపడుతుంది.

**ఉదాహరణ:** విద్యపై వ్యాసం రాస్తూ.. బలహీన వర్గాల విద్య గురించి ఒక దృక్పథాన్ని జోడిస్తే వ్యాసం కచ్చితంగా ఈ కోణాన్ని స్పృశించే అతికొద్ది మంది అభ్యర్థుల్లో ఒకరిగా నిలుస్తాం.

**స్థూల కోణం నుంచి సూక్ష్మ కోణం వరకు పరిశీలించాలి**

- అంతర్జాతీయం - జాతీయం - ప్రాంతీయం - స్థానికం - వ్యక్తిగతం

4. కాలచక్రాన్ని అనుసరించాలి: నేడు-నేడు-రేపు (లేదా) గతం - వర్తమానం - భవిష్యత్తు.
సమస్యలు/పరిస్థితుల్లో మార్పులను ఎప్పటికప్పుడు విశ్లేషించాలి.

5. విభిన్న ప్రదేశాల వద్ద గల సమస్యలను తెలియజేయాలి.
ఇల్లు, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయం మొదలైనవి.

6. తల్లి గర్భం నుంచి భూగర్భం వరకు సాగే ప్రయాణాన్ని వివరించాలి.

- జననం నుంచి మరణం వరకు ఎదుర్కొంటున్న సమస్యలు.

**ఉదాహరణ:** స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు - పిండంగా, బాలికగా, యువతిగా, గృహిణిగా, వృద్ధురాలిగా..

**సులభమైన మరో కోణం: 5W, 1H**

- ఏదైనా వ్యాసం రాసే ముందు ఎందుకు, ఏమిటి, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనే కోణాల్లో ఆలోచించి, ఆయా కోణాలకు సంబంధించిన అంశాలను వివరిస్తూ వ్యాసాన్ని విస్తరించాలి.
- సహజంగా, 5W, 1H టెక్నిక్ అనేది పరిశోధనాత్మక పాత్రికేయులు, డిటెక్టివ్‌లు, పరిశోధకులు పూర్తి, కచ్చితమైన కథను సేకరించడానికి ఉపయోగించే ఒక సాధారణ వ్యూహం.
- పాత్రికేయులు 5W, 1H ఫ్రేమ్‌వర్క్‌ను ఉపయోగించి ఏదైనా ఒక పరిస్థితి గురించి సరైన వాస్తవాలను సేకరించడానికి, ఆ వాస్తవాలను పాఠకులకు సమర్థవంతంగా తెలియజేయడానికి ఉపయోగిస్తారు.


**5-W**

Who- **ఎవరు:** ఇందులో ఎవరి ప్రమేయం ఉంది?
Where- **ఎక్కడ:** ఎక్కడ జరిగింది?
What- **ఏమిటి:** ఏం జరిగింది?
When- **ఎప్పుడు:** ఎప్పుడు జరిగింది?
Why- **ఎందుకు:** ఎందుకిలా జరిగింది?

**1H**

How- **ఎలా:** ఎలా జరిగింది?

- ఈ ప్రశ్నలకు సమాధానాలు జర్నలిస్ట్ రాసే ఏ వ్యాసంలోనైనా కనిపించాలి. పాఠకులకు అవసరమైన కీలక సమాచారాన్ని తెలియజేయడానికి ఒక పాత్రికేయుడు ఈ విధానాన్ని అనుసరిస్తాడు. ఈ టెక్నిక్‌నే మనం వ్యాసాన్ని విస్తరించడానికి ఉపయోగించుకున్నప్పుడు ఒక చక్కటి వ్యాసం రూపొందించవచ్చు.



**ఎలా ముగించాలి?**

- అద్భుతమైన వ్యాసానికి అద్భుతమైన పరిచయం ఎంత ముఖ్యమో, అద్భుతమైన ముగింపూ అంతే ముఖ్యం. పక్షపాతం, ప్రతికూల ధోరణి, నిరాశావాదం ఉండకూడదు.
- వ్యాసంలోని ప్రధాన అంశాలను క్లుప్తంగా వివరిస్తూ (సంక్షిప్తీకరించడం), ముందుకెళ్లే మార్గం లేదా కార్యాచరణను సూచించాలి. సహేతుకమైన పరిష్కార మార్గాలను సూచించాలి.
- వీలైనంత స్పష్టంగా, క్లుప్తంగా, దూరదృష్టితో, సమతుల్యంగా, సానుకూల దృక్పథంతో/ ఆశాజనకంగా ఉండాలి.

మిగతా 6వ పేజీలో...

కె. భాస్కర్ గుప్తా
హైదరాబాద్

